క్లుప్తంగా

పదిలో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

దొర్నిపాడు: పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, దొర్నిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి భవిష్యత్ చదువులకు పునాది అన్నారు. కావునా ఇప్పటి నుంచి పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అదనపు తరగతుల నిర్వహణ, విద్యాంజలి అమలు, ఎఫ్‌ఏ–1 పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాలను ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా బోధించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు దస్తగిరి, చెన్నకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు



మద్దూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: పంటల సాగులో రైతులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తే పంటకు ప్రయోజనంతో పాట భూమి సారవంతమవుతుందని మండల ఏఓ రంగనేతాజి అన్నారు. ఆయన బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత పోషక నిర్వహణ, వాటి ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): కళారాధన ఆధ్వర్యంలో బుధవారం తెలుగు, ఆంగ్లం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మాతృభూమికి కళార్పన పోటీల్లో భాగంగా టౌన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, జనార్దన్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శేషఫని, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అఖిలభారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 9వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు సుందర్‌రామరాజు, కార్యదర్శి రాజునాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏఐఎస్‌బీ మహాసభల విజయవంతానికై వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ 9వ జాతీయ మహాసభలకు 19 రాష్ట్రాల నుంచి 350 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో కడపనగరంలో జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. విద్య, వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడంపై జాతీయ మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాష్ట్ర కన్వీనర్ రవీంద్రనాయక్, జిల్లా అధ్యక్షుడు వెంకటాద్రి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌లో శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు, మెయింటెనెన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు శ్రీశైలం ఐటీఐ ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు బుధవారం తెలిపారు. పి.ఎం. సూర్యాఘర్ మఫ్త్‌బిజిలి యోజన పథకంలో భాగంగా ఆరు రోజుల షార్ట్ టర్మ్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు సున్నిపెంటలోని ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఇతర 99086650004, 9908993910, 9440849850లను సంప్రదించాలన్నారు.



నంద్యాల బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



● ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

నంద్యాల(వ్యవసాయం): కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు తరలిపోవడంతో రెండురోజులుగా ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లా నుంచి 280కు పైగా బస్సులు సీఎం పర్యటనకు కేటాయించారు. ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, కర్నూలు, తాడిపత్రి, కర్నూలు, కోవెలకుంట్ల తదితర ప్రధాన రూట్లలో ఎక్కువశాతం బస్సు సర్వీసులు రద్దు చేశారు. జిల్లా కేంద్రం నంద్యాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బుధవారం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మహిళలు , చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు అరకొర బస్సులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. కాగా బుధవారం రాత్రి నుంచి యథావిధిగా బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

12వ పీఆర్‌సీని ప్రకటించాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని, అంత వరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీవీ ప్రసాద్, అరవింద్, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. ఈనెల 25న విజయవాడలో జరిగే రణభేరి బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం నంద్యాల పట్టణంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రణభేరి ప్రచార జాత సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఉమ్మడి జిల్లాలో జరుగుతుందన్నారు. ఈనెల 15వ తేదీ కర్నూలు జిల్లాలో ప్రారంభమై అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, కడప జిల్లాలో ముగించుకొని ఆళ్లగడ్డలో ప్రవేశించి నంద్యాల, బనగానపల్లె, డోన్‌లో ముగుస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారెడ్డి, రామదాసు, సోమన్న, ప్రేమ్‌కాంత్, రాంనాయక్, బాలస్వామి, రామకృష్ణారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిని బుధవారం ఏపీఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నంద్యాల జిల్లా పట్టణ శాఖ అధ్యక్షుడు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి నాగేషు మాట్లాడుతూ విద్యార్థులకు బోధన చేయడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దేవేంద్ర, కార్యదర్శి సభ్యులు శివకుమార్, రవికుమార్, పద్మజ, పద్మావతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

రుద్రవరం: తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆలమూరు–4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి వ్యాధి నిరోధకం, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. క్షయ, పోలియో, కోరింత దగ్గు, ధనుర్వాతం, కామెర్లు, తట్టు వంటి జబ్బులు రాకుండా పిల్లలకు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు.



చిన్నారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యాధికారి

విశేష పూజలు





పూజలందుకున్న సాక్షి గణపతి, వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని సాక్షి గణపతి, జ్వాలా వీరభద్రస్వామికి బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ గోడకు ఆనుకుని ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం కేంద్రం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు ఉండి ఛామనఛాయ వర్ణం , మాసిన గడ్డంతో ఉన్నాడు. ముదురు నీలం రంగు టీషర్టు, ముదురు నీలం రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసినవారు 91211 01061 లేదా 08518–277187కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ శేషయ్య విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు అరెస్టు

నంద్యాల: ఓ వ్యక్తిని రూములో బంధించి దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్ బాషా తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరిలో పట్టణంలోని మార్కెట్ యార్డులోని ఓ గదిలో ఓ వ్యక్తిని బంధించి ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడ్డారు.ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై సుమోటోగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు ఫరూక్ కూలి తీసుకొని పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. పట్టణంలోని నడిగడ్డకు చెందిన ఉశేని, అల్తాఫ్, సుభాన్ అనే ముగ్గురు ఫరూక్‌ను ఆటో లో పండ్లు తీసుకెళ్లి అమ్ముకొని రమ్మని చెప్పారు. ఆటో తీసుకొని వెళ్లిన అతను తిరిగిరాలేదు. ఈ విషయంలో ఆగ్రహించిన ఆ ముగ్గురు వెతికి పట్టుకొని మార్కెట్ యార్డులోని ఓ గదిలో బంధించి కాళ్లతో తన్నుతూ, కట్టెలతో దాడి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడటంతో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

బేతంచెర్లలో ఉద్రిక్తత

బేతంచెర్ల: పట్టణంలోని కొలుములపల్లె రహదారిలోని బైటిపేట కళ్లాల వీధి సమీపంలోనన్న స్థలాల విషయంలో ఇరువర్గాల మధ్య బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ స్థలాలు పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై 35 సెంట్లు ఉండగా, మరో వ్యక్తి ఆ స్థలం అంతా తనదేనని కోర్టును ఆశ్రయించి ఐదుగురికి నోటీసులు పంపారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తామని ఇరువర్గాల వారిని స్థలం దగ్గరకు రావాలని సూచించారు. అయితే అక్కడికి జనం భారీగా చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి గొడవకు దారితీయడంతో ఎస్‌ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది ఇరువర్గాలను చెదరగొట్టారు.



గుమికూడిన జనం

బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి

● లొద్దిపల్లె ఎంపీటీసీ నాగశిరీష నిరసన

ఓర్వకల్లు: తమ గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని కోరుతూ లొద్దిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష బుధవారం మండల పరిషత్ సమావేశ భవనం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి నాగశిరీష తన చంటి బిడ్డతో హాజరయ్యారు. సమస్యలను అధికారుల దృష్టి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదంటూ ఆమె బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. గ్రామంలోని బండ్ల కనుమలో ఉన్న సర్వేనంబర్ 129/ఎ, 130ఎలలో ప్రభుత్వ భూమిని కొన్నేళ్ల నుంచి 100 మంది పేదలు సాగు చేసుకుంటుండటంతో వారికే పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పేర్లపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలని రైతులు పలు మార్లు అధికారులను కోరినా అటవీ భూమి అంటూ కాలయాపన చేస్తుండటం తగదన్నారు. అలాగే గ్రామ నడిబొడ్డున కొందరు బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో మహిళలు, చిన్నపిల్లలు అటు వెళ్లేందుకు జంకుతున్నారన్నారు. ఎంపీటీసీలకు 18 నెలల నుంచి పెండింగ్ ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్ స్పందిస్తూ లొద్దిపల్లె గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములు అటవీశాఖ పరిధిలోకి వస్తాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే హక్కు తమకు లేదన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాగశిరీష

డెంగీ సోకిందంటూ చికిత్స

దొర్నిపాడు: మండలంలోని వెంకటేశ్వరనగరం గ్రామానికి చెందిన ధనలక్ష్మి అనే మహిళకు జ్వరం వస్తుండటంతో దొర్నిపాడులోని ఓ ప్రైవేట్ క్లినిక్ డాక్టర్‌ను సంప్రదించింది. అతను డెంగీ సోకిందంటూ రెండు రోజులు వైద్యపరీక్షలు కూడా నిర్వహించారు. ఈ విషయం స్థానిక వైద్యసిబ్బందికి తెలియడంతో డబ్ల్యూ కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉసేన్‌కు విషయం చెప్పారు. ఆయన బుధవారం ప్రైవేటు డాక్టర్ ఇచ్చిన నివేదికలు పరీక్షించగా తెల్లపేపర్‌లో డెంగీ పాజిటివ్ ఉన్నట్లు రాసి ఉంది. వెంటనే అతను బాధితురాలి రక్తనమూనాలు సేకరించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించగా నెగటివ్ అని తేలడంతో అందరూ అవాక్కయ్యారు. డెంగీ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీ కేసులు లేవని వెల్లడించారు. తప్పుడు రిపోర్టులు ఇచ్చి దోపిడీకి పాల్పడ్డటం సరికాదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వైద్యాధికారి ఉసేన్ తెలిపారు. సీజనల్ వ్యాధుల్లో భాగంగా జ్వరం వంటి రోగాలు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకొని వైద్యసేవలు పొందాలని ప్రజలను కోరారు.

బైక్‌ను ఢీకొన్న ఐచర్ వాహనం

●వ్యక్తికి గాయాలు

జూపాడుబంగ్లా: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఐచర్‌వాహనం ఢీకొనటంతో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం నందికొట్కూరు సమీపంలోని రబ్బానిగోదాం వద్ద చోటుచేసుకుంది. కేతవరం గ్రామానికి చెందిన శివశంకర్‌నాయుడు ద్విచక్రవాహనంపై తూడిచెర్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో నందికొట్కూరు సమీపంలోని రబ్బానిగోదాం వద్దకు చేరుకోగానే కర్నూలు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్తున్న ఐచర్‌వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివశంకర్‌నాయుడు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు అతన్ని 108లో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని ఐచర్ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.



గాయాలపాలైన శివశంకర్‌నాయుడు

మ్యాజిక్ డ్రైన్ పనులు ప్రారంభం

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని కొండుపల్లె గ్రామంలో మ్యాజిక్ డ్రైన్ పనులను ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలో పైలట్ ప్రాజెక్ట్‌గా మొదటి విడతలో ఉయ్యాలవాడ మండలంలోని కొండుపల్లె గ్రామాన్ని జిల్లా ఉన్నతాధికారులు ఎంపిక చేసినట్లు ఏపీడీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు బయటకు పంపేందుకు కాలువలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వంద మీటర్ల పొడువు సీసీ డ్రైన్ నిర్మిస్తే రూ. 4 లక్షలు వ్యయమవుతుంది, అదే మ్యాజిక్ డ్రైన్ ద్వారా రూ. 1 లక్షతో పూర్తి చేయవచ్చన్నారు. డబ్బు ఆదాతో పాటు ఈ పద్ధతితో ఏర్పాటు చేస్తున్న డ్రైన్ మురికి నీరు ఎక్కడివి అక్కడే భూమిలోకి గుంత ద్వారా ఇంకిపోతాయని వెల్లడించారు. దశల వారీగా అన్ని గ్రామ పంచాయతీల్లో మ్యాజిక్ డ్రైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. క్లస్టర్ పరిధిలో 700 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 634 ఎకరాల్లో గుంతలు తీయడం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇరిగెల పద్మజ, పంచాయతీ కార్యదర్శి సుమిత్ర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



కొండుపల్లెలో మ్యాజిక్ డ్రైన్ పనులు ప్రారంభిస్తున్న ఏపీడీ సాంబశివరావు

మోతాదుకు మించి ఎరువులు వాడితే అనర్థాలే



నానోయూరియా ఉత్పత్తుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

నంద్యాల(అర్బన్): వరిలో ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32కిలోల పొటాష్ ఎరువులను మాత్రమే వేసుకోవాలని మోతాదుకు మించి వాడితే అనర్థాలు జరుగుతాయని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఊడుమాల్పురం, పోలూరు గ్రామాల్లోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో నానో యూరియా, డీఏపీలను వాడటం ద్వార పర్యావరణం, భూమి కాలుష్యం తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. పకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వార తక్కువ ఖర్చుతో మేలైన దిగుబడులు సాధించ వచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవల్లిక, ఆర్‌ఎస్‌కే సిబ్బంది సంజీవ్,పల్లవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రప్రభుత్వం వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వాటిని నిర్మించి కళాశాలలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండాలని, విద్యలో 50శాతానికి పైగా ప్రైవేటు పరం అయిందన్నారు. వైద్య విద్య పేద విద్యార్థులకు అందనంత దూరంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీని ప్రైవేటు పరం చేస్తున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తక్షణమే విరమించుకోవాలన్నారు.లేని పక్షంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఉయ్యాలవాడలో ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఈఈ నాగరాజు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో ఎస్సీ బాలుర వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతనంగా రూ. 29 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వసతి గృహం గదులలో ఏర్పాటు చేసిన బండపరుపు పనులను ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలో మౌలిక వసతుల్లో భాగంగా ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో చేపట్టిన నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయన్నారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించండి

రుద్రవరం: నానో యూరియా పంటకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారి సుమతి రైతులకు తెలిపారు.మండల పరిధిలోని డి.కొట్టాలలో బుధవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. సాధారణ యూరియాకు నానో యూరియాకు గల వ్యత్యాసాన్ని వివరించారు. నానో యూరియా వాడటం వల్ల 80శాతం నత్రజని పంటకు అందుతుందని పంటపై 10 రోజుల వరకు ప్రభావం ఉంటుందని తెలిపారు. ఏడాది పాటు నిల్వ ఉంచుకోవచ్చని అన్నారు. అలాగే ఒక ఎకరానికి 500 మి.లీ. సరి పోతుందని అది కూడా డ్రోన్ ద్వారా పిచికారీ చేయిస్తే ఇంకా బాగుంటుందని ఆమె రైతులకు వెల్లడించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు రాజు, ఫహిమా తబస్సుమ్ తదితరులున్నారు.



డి.కొట్టాల వద్ద డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేయిస్తున్న దృశ్యం

ఆత్మహత్యలతో కుటుంబాలు విచ్ఛిన్నం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

గోస్పాడు: ఆత్మహత్యలతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, ఓర్పుతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా నంద్యాల మెడికల్ కళాశాలలో మానసిక వైద్యవిభాగం హెచ్‌ఓడీ డాక్టర్ లోకేశ్వర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఆవేశ పడరాదన్నారు. సమస్య ఏదైనా ఆత్మహత్యలు శరణ్యం కాదని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఎవరైతే బాధలో ఉంటారో వారితో మాట్లాడాలని, వారికి సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే మానసికంగా ఇబ్బంది పడే వారందరూ టెలిమానస్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ నిరంజన్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు సింధుజా

నంద్యాల(న్యూటౌన్): రైతు ఆత్మహత్యల నివారణ కోసం వారి సమస్యలపై పోరాడుతామని ప్రముఖ మానసిక వైద్యురాలు సింధుజా, డాక్టర్ రోహిత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రపంచ రైతు ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అత్యధిక రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయంలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ కౌలు రైతులు, పేద మధ్య తరగతి రైతులు ఆరుగాలం కష్టపడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడం లేదన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క్, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.